


నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I | హైదరాబాద్, గురువారం 19 సెప్టెంబర్ 2024 | VIKARABAD


## ఉక్కపోత.. ఉక్కిరిబిక్కిరి

సిటీబ్యూరో, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): వేడి గాలుల ప్రభావంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి దాటి నమోదవుతున్నాయి. దీంతో ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. ఉదయం నుంచే ఎండలు దంచికొట్టడంతో ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 32.8, కనిష్ఠం ఉష్ణోగ్రతలు 23.0 డిగ్రీలు, గాలిలో తేమ 50 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.



## ఉక్కు వ్యర్థాలపై సందిగ్ధం

**రీ సైకిల్ విషయంలో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ మధ్య అవగాహన లోపం**

**ఆదాయం వచ్చే అవకాశమున్నా.. నిర్లక్ష్యం**

గతంలో సేకరించిన ఉక్కు వ్యర్థాలతో రూ. 12 కోట్ల ఆదాయం

పది రోజుల్లో 8,130 మెట్రిక్ టన్నులు తొలగింపు

**సాధారణంగా ఆదాయం వస్తుందంటే.. ఏ ప్రభుత్వ శాఖలైనా.. అధిక ప్రాధాన్యత ఇస్తాయి. ఇంకా ఆదాయం పెంచుకునేందుకు కొత్త మార్గాలను అన్వేషిస్తాయి. కానీ ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయి హెచ్‌ఎండీఏ, బల్దియా శాఖలు. భక్తనీరాజనాలతో నవరాత్రులు పూజలందుకున్న గణనాథుడి విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లో ఘనంగా నిమజ్జనం చేశారు. అయితే నిమజ్జనం అనంతరం భారీ సంఖ్యలో వ్యర్థాలు పోగయ్యాయి. వీటిని తొలగించే బాధ్యత హెచ్‌ఎండీఏ తీసుకున్నా.. వాటిని తరలించి.. రీసైకిల్ వ్యవహారాలన్నీ బల్దియానే పర్యవేక్షిస్తున్నది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. విగ్రహాలకు సంబంధించిన ఉక్కు వ్యర్థాలపై మాత్రం సందిగ్ధత నెలకొంది. వీటిని ఏం చేయబోతున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. రెండు శాఖల మధ్య అవగాహన కొరవడటంతో తుక్కు వ్యర్థాలపై కోట్ల ఆదాయాన్ని కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.**

**-సిటీబ్యూరో, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ)**

హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాలను నిమజ్జనం చేశాక ఏర్పడే వ్యర్థాల తొలగింపు బాధ్యతలు హెచ్‌ఎండీఏ తీసుకున్నది. వాటిని తరలించి, రీసైకిల్ పనులను బల్దియానే పర్యవేక్షిస్తున్నది. అలాగే నగరంలోని ఇతర చెరువుల్లో వ్యర్థాల తొలగింపు బాధ్యతను జీహెచ్‌ఎంసీ తీసుకున్నది. హుస్సేన్ సాగర్ నుంచి తొలగించిన వ్యర్థాలను బల్దియానే తరలిస్తున్నది. కానీ ఇరు శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా విగ్రహాలకు సంబంధించిన ఇనుప వ్యర్థాలను ఏం చేయబోతున్నారనేది తెలియాలి. రూ. 5 లక్షల లోపు విలువ చేసే పనులకు ఎలాంటి టెండర్లు లేకుండానే కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనులు అప్పగించే వీలు ఉండగా, ఇదే ప్రాతిపదికన కోట్లు విలువ చేసే ఐరన్ వ్యర్థాలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది చర్చనీయాంశంగా మారింది. గతేడాది తొలగించిన 4వేల టన్నుల ఐరన్ వ్యర్థాలతో జీహెచ్‌ఎంసీకి రూ. 12 కోట్ల ఆదాయం సమకూరింది. కానీ హెచ్‌ఎండీఏ పరిధిలో హుస్సేన్ సాగర్‌లోని వ్యర్థాలతో వచ్చే ఆదాయం విషయంలోనే అసలు సమస్య నెలకొన్నది. ఇరు సంస్థల మధ్య సమన్వయం లేకపోవడంతో ఇనుప వ్యర్థాల ద్వారా ఆదాయం విషయంలో సందిగ్ధత నెలకొన్నది.





# అపార నష్టం..

# అరకొర సాయం..

**వర్షాలకు ఇండ్లు కూలిపోయిన బాధితులకు సరిపడా అందని సాయం**

- మొదట రూ.3200 సాయం అందజేత
- ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో రూ.16,500 ఇచ్చేందుకు నిర్ణయం
- మిగిలిన రూ.13,300 బాధితుల బ్యాంకు ఖాతాల్లో జమ
- కూలీ డబ్బులకు కూడా సరిపోదని బాధితుల అసంతృప్తి
- డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టిస్తామని సర్కారు దాటవేత
- జిల్లావ్యాప్తంగా కూలిన 333 ఇండ్లు
- పంటల నష్టంపై అధికారులు నివేదికలు అందజేసినా నష్టపరిహారంపై ప్రభుత్వం నుంచి రాని స్పష్టత
- 1242 ఎకరాల్లో పంట నష్టం

*వికారాబాద్ జిల్లాలో ఇటీవల కురిసిన ఎడతెరిపిలేని భారీ వర్షాలకు పంటలు నష్టపోవడంతోపాటు ఇండ్లు నేలకూలాయి. నిరాంతరాయంగా కురిసిన వర్షాలకు ఉన్న చిన్న గూడు కూడా కూలిపోవడంతో చాలా మంది నిరుపేదలు నిరాశ్రయులయ్యారు. వర్షాలకు కొన్ని చోట్ల పూర్తిగా ఇండ్లు కూలగా, మరికొన్ని 50 శాతానికిపైగా దెబ్బ తిన్నాయి. దీంతో నష్టపోయిన ఇండ్లకు ప్రభుత్వం నుంచి పరిహారం నష్టానికి తగినట్లుగా వస్తుందని బాధితులు ఆశించినప్పటికీ సర్కారు మాత్రం అరకొర సాయం అందజేసింది. నివాసముంటున్న ఇండ్లు కూలి నిరాశ్రయులైన వారికి ప్రభుత్వ నిర్ణయంతో నిరాశే మిగిలింది. సర్కారు ప్రకటించిన సాయంపై బాధితుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం మళ్లీ కొంత పెంచుతూ కొత్త జీవోను విడుదల చేయడం గమనార్హం. అలాగే పంట నష్టానికి సంబంధించి అధికారులు వివరాలను ప్రభుత్వానికి అందజేసినా ఇప్పటివరకు సర్కారు ఎలాంటి ప్రకటన చేయలేదు.*

*- వికారాబాద్, సెప్టెంబర్ 18, (నమస్తే తెలంగాణ)*

### ఆర్థిక సాయం సరిపోదు..



ఇండ్లు కూలిపోయినవారికి ప్రభుత్వం ఇస్తున్న నష్టపరిహారం రూ.16,500 ఏమాత్రమూ సరిపోదు. ఇల్లు పూర్తిగా కూలిపోయింది. ఇల్లు మళ్లీ కట్టుకోవాలంటే చాలా డబ్బులు కావాలి. సరిపడా డబ్బులు సర్కారు మంజూరు చేయాలి. దెబ్బతిన్న ఇండ్లకు కూడా నష్టపరిహారం ఎక్కువగా ఇవ్వాలి.

– జి.కృష్ణ. అంపల్లి, ధారూరు మండలం

### నష్టపరిహారం అందించి ఆదుకోవాలి



ఇటీవల కురిసిన భారీ వర్షానికి మా ఇంటి వెనుక భాగం పూర్తిగా కూలిపోయింది. ఇంటి లోపలి వైపు కూలి ఉంటే అందరం చనిపోయేవాళ్లం. సుమారు రూ.2లక్షల వరకు నష్టం జరిగింది. తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాను కానీ ఇప్పటివరకు నష్టపరిహారం రాలేదు. ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలి.

– గడ్డెనిబాయి లక్ష్మయ్య, కొత్లాపూర్, మర్పల్లి మండలం

జిల్లాలో ఇటీవల కురిసిన ఎడతెరిపిలేని భారీ వర్షాలకు ఇండ్లు కూలిన బాధితులకు ప్రభుత్వం మొదట కేవలం రూ.3200 సాయాన్ని అందజేసింది. ఇండ్లు కూలి గూడుతోపాటు ఇంట్లోని సామగ్రి అంతా కోల్పోయిన బాధితుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో రూ.16,500 అందజేస్తామని ప్రకటించి ఉత్తర్వులు జారీ చేసింది. సాయం చేసిన రూ.3200 పోనూ మిగిలిన రూ.13,300లను అధికారులు బాధితుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. కూలిన ఇండ్లు కట్టుకునేందుకు కాదు కదా.. కనీసం కూలీలకు కూడా ప్రభుత్వం ఇస్తున్న సాయం సరిపోదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 333 ఇండ్లు నేలకూలినట్లు జిల్లా యంత్రాంగం లెక్కతేల్చింది.

### పంట నష్టపరిహారమెప్పుడో..

జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అపార పంట నష్టం జరిగింది. పంట నష్టానికి సంబంధించిన వివరాలను అధికారులు ప్రభుత్వానికి అందజేసినా ఇప్పటివరకు పంట నష్టపరిహారంపై సర్కారు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఎకరానికి ఎంతమేర నష్టపరిహారం అందజేస్తామనేది కూడా ఇంకా ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఇప్పటివరకు ఆ దిశగా అడుగులు పడకపోవడం గమనార్హం. అప్పులు చేసి పంటలు వేసిన రైతులకు వర్షాలతో దెబ్బతిన్న పంటల స్థానంలో కొత్త పంటలు వేసేందుకుగాను పెట్టుబడి సాయం కూడా లేకపోవడంతో ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఎప్పుడు అందుతుందోనని ఎదురుచూస్తున్నారు.

### పంట నష్టపోయిన రైతులు 1125 మంది..

జిల్లావ్యాప్తంగా 1125 మంది రైతులకు చెందిన 1242 ఎకరాల్లో ఆయా పంటలకు నష్టం వాటిల్లింది. ఎక్కువగా దౌల్తాబాద్, కొడంగల్, వికారాబాద్, ధారూరు, నవాబుపేట మండలాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. నష్టపోయిన పంటల్లో కూడా ఎక్కువగా పత్తి, మొక్కజొన్న, కంది పంటలే ఉన్నాయి. కొడంగల్ మండలంలో వరి 46 ఎకరాలు, పత్తి–79 ఎకరాలు, కందులు–32 ఎకరాల్లో నష్టం జరిగింది. ధారూరు మండలంలో పత్తి–244, మొక్కజొన్న–45 ఎకరాల్లో., వికారాబాద్ మండలంలో వరి–32, పత్తి–338, మొక్కజొన్న–46, పసుపు–40, కందులు–34 ఎకరాల్లో., నవాబుపేట మండలంలో పత్తి–70 ఎకరాల్లో., దౌల్తాబాద్ మండలంలో 87 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం జరిగింది.



### సరిపడా డబ్బులు ఇవ్వాలి

ఇల్లు కూలిన మాకు మొదటగా రూ.3200 ఇచ్చారు. అది సరిపోదని విజ్ఞప్తి చేస్తే మళ్లీ రూ.13,300 సాయం చేస్తామన్నారు. ఆ డబ్బులు దేనికీ సరిపోవు. ఇల్లు పూర్తిగా దెబ్బతిన్నది. పూర్తి ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చు ఇవ్వాలని కోరుతున్నాం. అప్పుడే ఇల్లు నిర్మించుకోగలుగుతాం.

– సార భీమమ్మ, మోమిన్‌ఖుర్దు, ధారూరు మండలం



- రంగారెడ్డి జిల్లాలో గణనీయంగా తగ్గిన వానకాలం సాగు
- 3.01 లక్షల ఎకరాలకు.. ఇప్పటివరకు సాగైంది 2.51 లక్షల ఎకరాలే..
- గత ఏడాది వానకాలం సాగుతో పోలిస్తే ఈసారి లక్ష ఎకరాల్లో తగ్గనున్న సాగు విస్తీర్ణం
- పంటలు దెబ్బ తినడంతో అన్నదాత బతుకు అగమ్యగోచరం

# భరోసా లేక.. రుణం అందక..

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులకు కష్టకాలం మొదలైంది. ఏడాది కాలంగా జిల్లాలో వ్యవసాయానికి ప్రతికూల పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ క్రమంలో వానకాలం సాగు జిల్లాలో ఆశించిన స్థాయిలో కాలేదు. గత వానకాలం సీజన్‌తో పోలిస్తే ఈసారి లక్ష ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో పంటలు దెబ్బతిని రైతాంగం కుదేలైంది. అయితే రైతు భరోసా ఇవ్వకపోవడం.. రుణమాఫీ కాక, పంట రుణాలు అందక తదితర కారణాల వల్ల సాగు తగ్గినట్లు రైతాంగం చెబుతున్నది. బీఆర్‌ఎస్ పాలనలో గాడినపడ్డ ఎవుసం గాడి తప్పుతుండడం ఆందోళన కలిగిస్తున్నది.

- రంగారెడ్డి, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ)

### ఈసారి పంటలు డీలా..

జిల్లాలో వానకాలం పంటల సాగు లెక్కను వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తేల్చుతున్నారు. వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. ప్రస్తుత వానకాలంలో 3,01,280 ఎకరాల్లో పంటలు సాగవుతాయని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేయగా.. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 2,51,589 ఎకరాల్లో మాత్రమే పంటలు సాగయ్యాయి. సీజన్ ఆరంభం నుంచే పంటల సాగుకు రైతన్నలకు ప్రతిబంధకాలు ఎదురయ్యాయి. జూన్, జూలై నెలల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురువకపోవడంతో రైతులు అంతంత మాత్రంగానే పంటలను సాగు చేశారు. అత్యధికంగా పత్తిని, ఆతర్వాత వరిని సాగు చేస్తున్నారు. అరకొరగా సాగు చేసిన పంటలు సైతం ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దమొత్తంలో దెబ్బతిన్నాయి. గత ఏడాది వానకాలంలో నీరు పుష్కలంగా ఉండడంతో 3,47,989 ఎకరాల్లో వివిధ రకాల పంటలను జిల్లా రైతులు సాగు చేశారు. ప్రస్తుత వానకాలంలో అప్పటి పరిస్థితులు లేక అంతంతమాత్రంగానే పంటలను సాగు చేశారు. ఈ నెల 10 వరకు కేవలం 2,51,589 ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. గత సీజన్‌తో పోలిస్తే లక్ష ఎకరాల్లో పంటల సాగు విస్తీర్ణం తగ్గనున్నట్లు తెలుస్తున్నది. వరి సాగు గత సీజన్‌లో 1.40 లక్షల్లో సాగు కాగా.. ఈసారి 73,450 ఎకరాలే అయింది. గత సీజన్‌లో పత్తి 1.29 లక్షలు సాగయితే ఈసారి 1.16 లక్షల ఎకరాలకే పరిమితమైంది. ఇంకా 50 వేల ఎకరాల్లో వరిని సాగు చేసేందుకు నారుమళ్లు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వానకాలం సీజన్ ఈ నెలాఖరుతో ముగియనుండడం.. ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లో మిగిలిన వరి సాగును చేపట్టే సాహసాన్ని రైతులు చేయలేకపోతున్నారు. మరోపక్క ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడంపైననూ రైతుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏదిఏమైనా.. ఈసారి వానకాలంలో సాగు విషయంలో అంచనాలు తలకిందులయ్యాయని రైతాంగం ఆందోళన చెందుతున్నది.

### పెట్టుబడులకు రైతాంగం గోస

జిల్లాలో మొదటి విడుతలో 49,471 మందికి రూ.257.19 కోట్ల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. రెండో విడుతలో 22,915 మంది రైతులకు సంబంధించిన రూ.218.13 కోట్లను, మూడో విడుతలో 15,226 మంది రైతులకు రూ.185.40 కోట్ల రుణాలను మాఫీ చేసినట్లు ప్రభుత్వం చెబుతున్నది. మూడు విడుతల్లో కలిసి జిల్లాలో 87,612 మందికి రూ.660.72 కోట్లను మాఫీ చేసింది. నేటికీ రుణమాఫీ ప్రక్రియ జిల్లాలో అసంపూర్ణంగానే ఉన్నది.



చాలామంది రైతులు రుణాలను ఏండ్ల తరబడిగా చెల్లించకపోవడంతో మొండి బకాయిదారులుగా మారారు. దీనికితోడు రుణమాఫీ సైతం కాకపోవడంతో వారికి కొత్తగా రుణాలు అందే పరిస్థితి లేకుండా పోయింది. రుణమాఫీ అయిన తర్వాతే కొత్త రుణాలు ఇస్తామంటూ బ్యాంకర్లు స్పష్టం చేస్తున్నారు. దీంతో పెట్టుబడులకు జిల్లా రైతాంగం గోస పడుతున్నది. ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తీసుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీనికితోడు వానకాలం పంటల సాగుకు సంబంధించి పెట్టుబడి సాయంగా ప్రభుత్వం ఎటువంటి సాయం అందించలేదు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించిన సాయం పెట్టుబడులకు అక్కరకు వచ్చేది. సీజన్ ముగియవస్తున్నప్పటికీ రైతు భరోసా సాయం లేకపోవడంతో రైతులు పెట్టుబడులకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతాంగం వానకాలంలో అరకొరగానే పంటల సాగు చేపట్టింది.



యాచారం మండలం నల్లవెల్లిలో..

### గణనాథులకు ఘన వీడ్కోలు..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా రెండో రోజు బుధవారం కూడా గణనాథుల నిమజ్జనోత్సవాలు శోభాయమానంగా సాగాయి. భాజాభజంత్రీలు, మేళతాళాలు, డీజే సౌండ్స్ మధ్య యువతీయువకుల నృత్యాలు చేస్తూ ఊరేగింపులు నిర్వహించారు. అనంతరం స్థానిక చెరువుల్లో గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేసి వీడ్కోలు పలికారు.

– న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ